

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈ నెల 25న సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అర్జీదారులు తమ అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలనుకుంటే 1100 నెంబరుకు కాల్ చేయవచ్చునని తెలిపారు.


రైల్వేట్రాక్ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలేవీ?

- 7నెలలు గడిచినా అమలు కాని వంద రోజుల హామీ
- నమ్మించి మోసం చేశారంటున్న బాధితులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / దత్తిరాజేరు

దత్తిరాజేరు మండలం పెదమానాపురం రైల్వే ట్రాక్ నిర్వాసితులకు 100రోజుల్లో భూమి సేకరించి, ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఏడు నెలలు గడిచినా పట్టించు కోకపోవడంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది. తమను నమ్మించి మోసం చేశారని, ప్రభుత్వం తమను పట్టించుకోకపోతే తామే ప్రభుత్వం గురించి ఆలోచించాల్సివుంటుందని వారు అంటున్నారు. మరోవైపు ఇటీవల జరిగిన డిఆర్‌సి సమావేశంలో ఈ సమస్యపై జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మధ్య చర్చకు వచ్చింది. ఈనేపథ్యంలో బాధితుల సమస్య మరోసారి చర్చనీయాంశంగా మారింది.

విజయనగరం నుంచి గజపతినగరం మీదుగా బొబ్బిలి వైపు తలపెట్టిన మూడో రైల్వే లైను నిర్మాణ పనుల్లో భాగంగా మానాపురం గ్రామంలో సుమారు 32కుటుంబాలు నిర్వాసితులుగా మారిన సంగతి తెలిసిందే. ఇందులో 28 కుటుంబాల వారు పక్కా ఇళ్లను కోల్పోయారు. వారందరికీ తూతూ మంత్రంగా నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. అక్కడి అధికార, ప్రతిపక్ష పార్టీలూ పట్టించుకోలేదు. దిక్కుతోచని పరిస్థితుల్లోవున్న ఆయా కుటుంబాలు సిపిఎంను ఆశ్రయించారు. గతేడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరి నెలల్లో స్థానిక తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అప్పటికీ అధికార యంత్రాంగం స్పందించలేదు సరికదా ఇళ్ల తొలగింపునకు ఏకపక్ష నిర్ణయం తీసుకుంది. పొక్లెయినర్లతో ఇళ్లను తొలగించేందుకు అధికారులు ఫిబ్రవరి 6వ తేదీన సమాయత్తం కాగా సిపిఎం నాయకులు శ్రీనివాస్, లక్ష్మి నాయకత్వంలో బాధితులు తొలగింపు చర్యలను అప్పట్లో అడ్డుకున్నారు. ఇళ్లు తొలగిస్తే తాడోపేడో అన్న రీతిలో బాధితులు అప్పట్లో నిరసన దీక్ష చేపట్టగా పోలీసులు ఆ శిబిరాన్ని భగ్నంచేసి, ఇళ్లను కూల్చేందుకు ప్రయత్నించారు. ఇళ్లను తొలగిస్తే ఊరుకునేది లేదని, ఇళ్ల స్థలాల సంగతి తేలేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ బాధితులు, సిపిఎం నాయకులు భీష్మించుకు కూర్చోవడంతో వైసిపికి చెందిన జెడ్‌పిటిసి సభ్యులు రౌతు రాజేశ్వరి కూడా శిబిరం వద్దకు వచ్చి బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. 'జైలుకైనా వెళ్తాం కానీ, తమ ఇళ్లను కూల్చితే ఊరుకునేది లేదు' అంటూ బాధితులు తెలిపారు. దీంతో, తహశీల్దార్ విజయ్‌భాస్కర్ ఆర్‌డిఒను సంప్రదించి 100 రోజుల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఈలోపే భూమిని సేకరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఈ ప్రాంతాన్ని సందర్శించిన విజయనగరం ఎంపీ కూడా ప్రభుత్వం తరపున ఇళ్ల స్థలాలు మంజూరు చేయించడంతోపాటు ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. హామీలు ఇచ్చి ఏడు నెలులైనా ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. దీంతో, బాధితులు బంధువుల ఇళ్లల్లో నెలల తరబడి తలదాచుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్ర అవస్థలు పడ్డామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పునరావాసం కల్పించాలని బ్రిడ్జి వద్ద నిరసన తెలుపుతున్న నిర్వాసితులు (ఫైల్)

మంత్రి చొరవ ఫలించేనా?

ఈనెల 14న జరిగిన డిఆర్‌సి సమావేశంలో మానాపురం రైల్వే ట్రాక్ నిర్వాసితుల ఇళ్ల స్థలాల విషయం చర్చకు వచ్చింది. నిర్వాసితులకోసం ప్రభుత్వ తరపున స్థలం సేకరించాలని కలెక్టర్‌ను మంత్రి కోరారు. ఇప్పట్లో స్థలాలు కొనుగోలు చేయడం కష్టమని, సాధ్యాసాధ్యాలపై మరోసారి ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి చర్చిస్తామని కలెక్టర్ చెప్పారు. లేదంటే ప్రభుత్వ భూమి అయినా చూస్తామని అన్నారు. ఈనేపథ్యంలో కలెక్టర్, మంత్రి ఇళ్ల స్థలాల సమస్యపై చొరవ చూపాలని సిపిఎం నాయకులు, మానాపురం వాసులు కోరుతున్నారు.

ఫ్యాక్టరీ, సంస్థల రిజిస్ట్రేషన్లకు స్పెషల్ డ్రైవ్

- రికార్డుల వెరిఫికేషన్ లేకుండానే డిసెంబర్ 31లోపు అనుమతి
- ఇఎస్‌ఐ విశాఖ సబ్‌రీజనల్ డైరెక్టర్ వి.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఇఎస్‌ఐ విశాఖ రీజనల్ డైరెక్టర్ వి.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కర్మాగారాలు, సంస్థల రిజిస్ట్రేషన్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఇఎస్‌ఐ విశాఖ సబ్ రీజనల్ డైరెక్టర్ వి.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. డిసెంబర్ 31వ తేదీలోపు రిజిస్ట్రేషన్లు చేయించుకుంటే పాత రికార్డులు చూపించడం, అప్పటి వరకు రిజిస్ట్రేషన్ ఫీజు రసీదులు వంటివి చూపించాల్సిన అవసరం లేదని తెలిపారు. అపరాద రుసుము వంటివి కూడా చెల్లించాల్సిన అవసరం ఉండబోదని వివరించారు. స్థానిక ఇఎస్‌ఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇఎస్‌ఐ 1948 యాక్టు ప్రకారం కర్మాగారాలు, హోటల్స్, సినిమాహాల్స్, విద్యాసంస్థలు, ఆసుపత్రులు వంటి సంస్థల్లో 10మంది లేదా అంతకంటే ఎక్కువ ఉద్యోగులు లేదా కార్మికులు ఉంటే 15రోజుల్లోపు తప్పనిసరిగా ఇఎస్‌ఐ రిజిస్ట్రేషన్ పొందాల్సి వుంటుందని వివరించారు. తద్వారా ఆయా పరిశ్రమలు, సంస్థల్లోవున్న ఉద్యోగులకు ఆరోగ్యబీమా తదితర సదుపాయాలు పొంద వచ్చున్నారు. అవగాహన లేకపోవడం లేదా ఇతర కారణాల వల్ల ఇఎస్‌ఐ రిజిస్ట్రేషన్ చేయించుకోలేని సంస్థలు, కర్మాగారాల యాజమాన్యాలకు కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. కర్మాగారం లేదా సంస్థల కేటగిరీని బట్టి మూడు పోర్టర్లలో నమోదు చేసుకోవచ్చని వివరించారు. లిమిటెడ్ లేదా ప్రైవేట్ లిమిటెడ్ కేటగిరికి చెందినవారు ఎంసిఎ పోర్టర్, సెక్యూరిటీ ఏజెన్సీలు, లేబర్ కాంట్రాక్టు వంటి సంస్థలు ఇఎస్‌ఐసి.జిఒవి.ఇన్ పోర్టల్, మిగిలిన వారంతా శ్రమ సువిధ అనే పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమాన్ని వినియోగించు కోవడం ద్వారా మునుపటికాలానికి చట్టపరమైన చర్యల నుంచి బయటపడడంతోపాటు సామాజిక భద్రత పొందవచ్చని వివరించారు. ఈ ఏడాది మార్చి 31లోపు నమోదైన కోర్టుకేసులను అక్టోబర్ 1నుంచి 2026 అక్టోబర్ 30లోపు అత్యంత సులువుగా పరిష్కరించు కునేందుకు కూడా అవకాశం ఉందన్నారు. తద్వారా చందా, వడ్డీ చెల్లింపు నుంచి మినహాయింపు పొందవచ్చని సూచించారు. సమావేశంలో ఇఎస్‌ఐ సోషల్‌సెక్యూరిటీ ఆఫీసర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బార్ లైసెన్సు ఫీజు తగ్గింపు

రేపటి వరకు మద్యం బార్ షాపులకు దరఖాస్తుల స్వీకరణ

ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ శ్రీనాథుడు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం బార్ పాలసీ విధానంలో లైసెన్సు దరఖాస్తు ఫీజులను భారీగా తగ్గించిందని ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు తెలిపారు. బార్ షాపుల్లో లాభాలు తక్కువని, నష్టాలు వస్తున్నాయని చాలామంది వ్యాపారులు అపోహలు కల్పిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు గతంలో కంటే దరఖాస్తు లైసెన్స్ ఫీజులను సగానికి ప్రభుత్వం తగ్గించిందని తెలిపారు. ఇప్పటికే గత మద్యం షాపుల్లో దరఖాస్తు చేసిన వారందరికీ ఫోన్ చేసి సమాచారం అందిస్తున్నామని ఇంట్రెస్ట్ ఉన్న వారిని మద్యం బార్ షాపులకు దరఖాస్తులు వేయాలని కోరినట్లు తెలిపారు. ఈనెల 26వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ తమ దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా నేరుగా ఎక్సైజ్ సూపరిండెంట్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. జిల్లాలో 28 బార్ షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. విజయనగరంలో 18, రాజాం5, భోగాపురం విఎంఆర్‌డిఎ పరిధిలో ఒకటి, బొబ్బిలిలో 4బార్ షాపులు కేటాయించారని తెలిపారు.

రూ.5 లక్షలు దరఖాస్తు ఫీజు

బార్ షాపులకు దరఖాస్తు చేసినందుకు ఐదు లక్షల రూపాయలు ఫీజుగా నిర్దేశించినట్లు తెలిపారు. రూ.10వేలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. గతంలో బార్ షాప్‌కు 10లక్షల రూపాయలు దరఖాస్తు ఫీజు ఉండేదన్నారు. గతం కంటే ఈ నూతన పాలసీలో బార్ షాపులకు లైసెన్స్ ఫీజు తగ్గించినట్లు తెలిపారు. రెండు లక్షల జనాభాకు పైబడి ఉన్న బార్ షాపులకు 55లక్షలు లైసెన్స్ ఫీజులు చెల్లించాలన్నారు.

ఒక్కో బార్ షాప్‌కు నాలుగు దరఖాస్తులు పైబడి వస్తేనే డ్రా

జిల్లాలో ఒక్కొక్క బార్ షాపునకు నాలుగు దరఖాస్తుల పైబడి వస్తేనే డ్రా తీస్తామని శ్రీనాథుడు తెలిపారు. నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వస్తే మరల దరఖాస్తులకు సమయాన్ని కేటాయించే అవకాశం ఉందని తెలిపారు.

టిడిపి జిల్లా అధ్యక్షులుగా సువ్వాడ పేరు పరిశీలన

వారంలో ప్రకటించే అవకాశం

ప్రజాశక్తి- విజయనగరం

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడుగా సువ్వాడ రవిశేఖర్ పేరును పరిశీలిస్తున్నట్లు తెలిసింది. గతంలో జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన కిమిడి నాగార్జున డిసిసిబి చైర్మన్ అయిన తరువాత అధ్యక్ష పదవి ఖాళీ అయింది. దీంతో చాలా మంది నాయకులు ఈ పదవిని దక్కించుకోవడానికి పోటీ పడుతున్నారు. పోటీ పడిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు సైతం ఉన్నారు. అయితే చివరికి అధిష్టానం మొదటి నుంచి పార్టీకి నమ్మిన బంటుగా ఉన్న రవిశేఖర్‌ను గుర్తించినట్లు తెలిస్తోంది. ఈ వారంలోనే ఆయన పేరు ఖరారు చేసే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

రవిశేఖర్‌తో పాటు రాజాం నియోజకవర్గం సంతకవిటి మండలానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు కొల్ల అప్పలనాయుడు పేరు కూడా తెరపైకి వచ్చింది. అయితే ఆయన వయస్సు రీత్యా 70కు పైగా ఉంటాయని, ఈ వయసులో జిల్లా బాధ్యతలు ఆయన చేపట్టలేడేమోనన్న ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుత గంట్యాడ టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కరరావు పేరు కూడా పరిగణలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. అయితే స్వతహాగా న్యాయవాది అయిన రవిశేఖర్ గత 30 ఏళ్లుగా టిడిపిలోనే ఉంటూ అనేక పదవుల్లో పార్టీకి సేవలందించారు. నెల్లిమర్ల మండల అధ్యక్షులుగా, ఎంపిపిగా, జిల్లా ఉపాధ్యక్షులుగా, అధికార ప్రతినిధిగా, ప్రస్తుతం టిడిపి రాష్ట్ర పరిశీలకులుగా పనిచేస్తున్నారు. రామతీర్థం శ్రీరాముని తల నరికేసిన గొడవల్లో ప్రశ్నించి నందుకు ఆయన్ను జైలుకు కూడా గత ప్రభుత్వం పంపింది. స్వయానా రవిశేఖర్ అన్నయ్య యడ్ల రమణమూర్తి కూడా గతంలో తాను పార్టీ మారినప్పుడు రవిశేఖర్‌ను కూడా పార్టీ మారాలని ఒత్తిడి చేసినా ఆయన నమ్ముకున్న సిద్ధాంతానికే కట్టుబడి ఉన్నాడు తప్ప పార్టీ మారలేదు. ఈనేపథ్యంలోనే జిల్లాలో చాలా మంది పేర్లు తెరపైకి వచ్చినా చివరికి ఈయన పేరును పరిశీలనలో ఉంచినట్లు తెలిసింది. జిల్లా మంత్రితో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా పెద్దల ఆశీస్సులు కూడా రవిశేఖర్‌కు ఉన్నట్లు తెలిస్తోంది. ఏదేమైనా మరో వారం రోజుల్లో టిడిపి జిల్లా అధ్యక్ష పదవిని అధిష్టానం ప్రకటించే అవకాశముంది.



జిల్లాపై మంత్రి లోకేష్ దృష్టి

జిల్లాపై మంత్రి నారా లోకేష్ దృష్టి సారించినట్లు తెలిస్తోంది. ఇందులో భాగంగానే జిల్లా అధ్యక్ష పదవిక వయస్సుతో పాటు సీనియారిటీని కూడా పరిగణలోకి తీసుకుంటు న్నట్లు తెలిసింది.జిల్లాలో కొత్త వారికి అవకాశం ఇచ్చి పార్టీని బలోపేతం చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు బోగట్టా. ఇందులో భాగంగానే జిల్లాలో అత్యధికంగా ఉన్న కాపు కులస్తులపై ఆయన దృష్టి పెట్టారు. ఆ కులానికి చెందిన వారిలో ఒకరికి అధ్యక్ష పదవి ఇవ్వాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే పై ముగ్గురు పేర్లను పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ ముగ్గురులో రవిశేఖర్ అయితేనే జిల్లాను గాడిలో పెట్టి బొత్స కుటుంబానికి ధీటుగా సమాధానం చెప్పగలడన్న అంచనాకు అధిష్టానం వచ్చినట్లు చర్చ జరుగుతోంది.



ప్రమాణ స్వీకారం చేస్తున్న హెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు

హెచ్‌ఎంల అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా ఎం.వేణుగోపాల్, టి. సన్యాసిరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రధానోపాధ్యాయులు సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా ఎం.వేణుగోపాల్, టి. సన్యాసిరాజు, కోశాధికారిగా టి.సాయి చక్రధర్ ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక పోర్ట్ సిటీ పాఠశాలలో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఎంపిక చేశారు. వీరితో పాటు మరికొంతమంది రాష్ట్ర కౌన్సిలర్లను, డివిజన్ నాయకులను,మహిళా ప్రతినిధిగా డి.గౌరీ దేవిని ఎంపిక చేశారు. ఎన్నికకు పరిశీలకులుగా ఎం.కృష్ణకుమార్ వ్యవహరించారు. నూతన అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రధానోపాధ్యాయులు సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి : ఎపిటిఎఫ్

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయులను తరగతికే పరిమితం చేయాలని ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు అన్నారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా సహాధ్యక్షురాలు ఎన్.వి.పైడిరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేసి, యాప్‌ల భారం తగ్గించాలని, ఆర్థిక బకాయిలు డిఎలు, పిఎఫ్, పెన్షనర్స్‌కు గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి వెంటనే ప్రకటించి పిఆర్‌సి కమిషన్ వేయాలన్నారు. బోధనేతర పనులు అప్పగించి విద్యార్థికి పరిసరాలకు తగ్గట్టుగా బోధన కాకుండా పై అధికారుల ఆదేశాలకు అనుగుణంగా బోధన చేయాలనడం వల్ల నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ఈ విధానమే కొనసాగితే విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు ఉద్యమించాల్సి వస్తుందన్నారు. నాణ్యతమైన విద్య అందించటానికి ఉపాధ్యాయ సంఘాలు, మేధావుల నుంచి సూచనలు, సలహాలు తీసుకునేందుకు సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్. శ్రీదేవి, వి. అప్పలరాజు, పి.దామోదర నాయుడు, చుక్క పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

టాంగ్ సూడో జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అస్సాం రాష్ట్రంలో త్వరలో జరగనున్న జాతీయ స్థాయి టాంగ్ సూడో జాతీయస్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ లోని 26 జిల్లాలనుండి గ్రామస్థాయి వరకు అభ్యర్థులు సన్నద్ధం కావాలని టాంగ్ సూడో స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డి. పోలారావు పిలుపునిచ్చారు.ఆదివారం ఫెడరేషన్ కార్యాలయం లో జరిగిన సమావేశంలో పొలారావు మాట్లాడుతూ సెప్టెంబర్ 16న ఉత్తరాంధ్ర జిల్లాలకు గరివిడి లోను, నవంబర్ 22,23 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలను విశాఖపట్నంలోను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుండి జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే అభ్యర్థులకు జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన తైక్వాండ్ ప్రకాష్ ద్వారా శిక్షణ అందించ బోతున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ బండారు చంద్ర శేఖర్, పాండ్రంగి రుక్మాకరరావు, ప్రకాష్ రావు, చెరుకూరి నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ ఆరిశెట్టి సందీప్, రవికుమార్ ఎస్.అప్పారావు, బొండా రమేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని ఎరువుల దుకాణాలపై ఆదివారం విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఎరువుల నిల్వలు అధికంగా ఉండడంతో సుమారు రూ.2,70,000 విలువైన ఎరువులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి సింహాచలం మాట్లాడుతూ ఎరువుల అమ్మకాల్లో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ దాడుల్లో ఎడిఎ నాగభూషణరావు, ఎఒ శ్రీనివాస్, ఎఇఒ సుధాకర్ పాల్గొన్నారు. జిల్లాలో ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడడం, ఎరువులతో పాటు వ్యాపారులు పురుగుమందులను కొనాలని షరతు పెట్టడంతో అధికారులు ఈ దాడులు చేపట్టారు.

వసతిగృహ విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-గజపతినగరంరూరల్

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు క్విజ్ పోటీలు ఎంత గానో దోహద పడతాయని సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచా లకులు ఎం.అన్నపూర్ణ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌సి బాలికల వసతిగృహం, లోగిస వసతి గృహంలో క్విజ్ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న అన్నపూర్ణ

సైబర్ మోసాల పట్ల అప్రమత్తం : ఆర్‌బిఐ సిజిఎం

ప్రజాశక్తి-విజయనగరంకోట

యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో బ్యాంకింగ్ సేవలు, సైబర్ మోసాలపై అవగాహన, ఫైనాన్షియల్స్ ఇంక్లూజన్ సదస్సుని మండలంలోని ద్వారపూడి గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిజర్వు బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ సింగల సుబ్బయ్య హాజరయ్యారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రజలంతా కేంద్ర ప్రభుత్వం అందచేస్తున్న అనేక పథకాలను, వివిధ సామాజిక భద్రత పథకాలను ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా వినియోగించుకోవాలని, సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు జనరల్ మేనేజర్ షాలిని, రిజర్వు బ్యాంక్ డిజిఎం కళ్యాణ చక్రవర్తి, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ జితేంద్ర శర్మ, ద్వారపూడి గ్రామ సర్పంచ్ అదిలక్ష్మి, ఎంపిటిసి మృణాళిని, గ్రామ పెద్దలు శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట రమణమూర్తి, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ మేనేజర్లు రాజా, శ్రీనివాస్, స్థానిక బ్యాంకు మేనేజర్లు, ఖాతాదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

డిజెలు పెడితే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఈ నెల 27న జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ పందిళ్ళు, మండపాలు ఏర్పాటుకు తప్పనిసరిగా సంబంధిత శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని ఎస్‌పి వకుల్‌జిందల్ తెలిపారు. వినాయక ఉత్సవాలను శాంతి యుతంగా ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావు లేకుండా నిర్వహించు కోవడానికి పోలీసుశాఖకు ప్రజలందరూ సహకరించాలని, ఉత్సవాలను సాఫీగా నిర్వహించేందుకు పోలీసుశాఖ ఆంక్షలను, సూచనలను పాటించాలని కోరారు. ఉత్సవాలు నిర్వహించే వారు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సింగిల్ విండో విధానంతో https://ganeshutsav.net లాగిన్ అయి, నిర్దేశించిన అనుమతులు ఎటువంటి రుసుము చెల్లించకుండా పొందొచ్చని తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో ప్రతీ ఒక్కరూ మతసామరస్యాన్ని పాటించాలని, ఇతర మతాల వారికి ఎటువంటి ఇబ్బందులు గురి చేయకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్సులు నిర్వహించినా, ఊరేగింపుల్లో డిజెలుపెట్టినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉత్సవాలను ప్రభుత్వ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహిస్తే సంబంధిత పంచాయతీ లేదా మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు పొందాలని తెలిపారు.

కంచేరులో ఆతిథ్య టూరిజం



- 3.61 ఎకరాలు కేటాయింపు
- రూ.23కోట్లతో తాటిపూడి ఎకో టూరిజం
- డిపిఆర్‌లతో ముందుకు వస్తున్న ఔత్సాహికులు
- పిపిపి పద్ధతిలో అభివృద్ధి
- 'ప్రజాశక్తి'తో జిల్లా పర్యాటకశాఖ అధికారి కె.కుమారస్వామి ముఖాముఖి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

భోగాపురం మండలం కంచేరు సముద్ర తీరంలో ఆతిధ్య టూరిజం ప్రాజెక్టు ఏర్పాటుకు 3.61 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందని జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.కుమార స్వామి తెలిపారు. రూ.23 కోట్లతో తాటిపూడి ఎకో టూరిజం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని వివరించారు. వీటితోపాటు రామతీర్థం, చింతపల్లిలో కూడా పర్యాటకాభివృద్ధికి ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. ఈవారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

కంచేరులో ఎలాంటి టూరిజం ఏర్పాటు చేయబోతున్నారు?


భోగాపురం మండలంలోని కంచేరు పరిసర ప్రాంతమంతా సముద్ర తీరంలో ఉంది. ఓవైపు సన్‌రే రిసార్ట్, మరోవైపు విమానాశ్రయం ఉంటుంది. ఈనేపథ్యంలో ఇక్కడికి వచ్చే పర్యాటకుల తాకిడి ఎక్కువగానే ఉండనుంది. ఈనేపథ్యంలో రిసార్ట్‌తో కూడిన హోటల్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 3.61 ఎకరాలు కేటాయించారు. ఇటీవలే చదును చేసి, తమకు అప్పగించారు.

తాటిపూడి టూరిజం ఎలా ఉండబోతోంది?

పర్యాటకులను మరింతగా ఆకర్షించాలనే లక్ష్యంతో రూ.23 కోట్లతో ఎకో టూరిజం తలపెట్టారు. అదనంగా జలాశయం దిగువభాగంలో 10.63ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఇందులో 12కాటేజీలు నిర్మించేందుకు ప్రతిపాదన తయారు చేశారు. రెండు కొండల నడుమ రోప్ వే, కేబుల్ అండ్ సస్పెన్ బ్రిడ్జి, చిల్డ్రన్ పార్కు, బర్డ్‌పార్కు, రెస్టారెంట్, కన్వెన్షన్ హాల్, ఓపెన్ ఎయిర్ థియేటర్ తదితర వాటిని నిర్మించనున్నారు. వీటిన్నంటికీ రూ.23కోట్ల మేర అవసరమౌతుందని అధికారులు అంచనాలు రూపొందించారు.

తాటిపూడిలో బోటింగ్ ఎలా నడుస్తోంది?

ఈ ఏడాది జనవరిలో ఇక్కడ అధునాతన బోట్లు ఏర్పాటు చేశాం. మంచి ఆదరణ లభిస్తోంది. ప్రతిరోజూ పర్యాటకుల తాకిడి ఉంటోంది. ముఖ్యంగా శని, ఆదివారాల్లో ఎక్కువ మంది వస్తున్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు రూ.80లక్షల ఆదాయం వచ్చింది. ఎకో టూరిజం కార్యరూపం దాల్చితే పర్యాటకుల తాకిడి మరింత పెరిగి, అందుకనుగుణంగా ఆదాయం కూడా పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుంది.



టూరిజం ప్రాజెక్టులు ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందా?

లేదు..! పిపిపి (ప్రభుత్వ, ప్రైవేటు పార్టనర్ షిప్) పద్ధతిలో దీన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం తరపున స్థలం కేటాయింపులు, ఇతర సదుపాయాల కల్పన ఉంటుంది. మిగిలి నవన్నీ సంబంధిత సంస్థలు సమకూర్చుకోవాలి. ఆదాయం లో 5శాతం నుంచి 10శాతం వరకు ప్రభుత్వానికి వస్తు ంది. ఔత్సాహికులు ఎవ రైనా డిపిఆర్ (డీటైల్ ప్రాజెక్టు రిపోర్టు)తో స్థలాన్ని పరిశీలించవచ్చు.

సంబంధిత స్థలాలను ఎవరైనా చూడొచ్చా?

తాము ఏర్పాటుచేయబోతున్న టూరిజం ప్రాజెక్టు స్థలాలను ఆసక్తి ఉన్నవారెవరైనా విజిట్ చేయవచ్చు. కానీ, అధికారిక విజిట్ చేయాలంటే రూ.25వేలు డిపాజిట్ చేయాలి. టూరిజం, రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్స్ అధికారులు కూడా సంబంధిత స్థలానికి వెళ్లి మొత్తం వివరాలను వెల్లడిస్తారు. ఇప్పటికే కంచేరులో ఆతిద్య టూరిజం, తాటిపూడిలో ఎకో టూరిజం ప్రాజెక్టులపై ఆసక్తి ఉన్న పలు సంస్థలు ముందుకు వచ్చాయి.

ఇంకెక్కడైనా టూరిజం ప్రతిపాదనలు ఉన్నాయా?

రామతీర్థాన్ని టెంపుల్ టూరిజం, రామనారాయణ టెంపుల్ వద్ద చిల్డ్రన్ టూరిజం, చింతపల్లిలో బీచ్ టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు ఉన్నాయి. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలమేరకు ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం.

జెవివి రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

బొబ్బిలి: విజయనగరంలో సెప్టెంబర్ 13,14న జరగనున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జెవివి జిల్లా అధ్యక్షులు పి.సత్యనారాయణ కోరారు. రాష్ట్ర మహాసభల గోడపత్రికను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో రోజురోజుకు పెరుగుతున్న మూఢ నమ్మకాలు నివారణకు జన విజ్ఞాన వేదిక పని చేస్తుందని చెప్పారు. మహాసభలను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని, మొక్కలు నాటి సంరక్షణ చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి, యుటిఎఫ్ నాయకులు కె.శ్రీధర్, శశిభూషణ్, కేశవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధం

రామభద్రపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి శ్రీకారం చుట్టిందని సోమవారం నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది, రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో ఇంటింటా పంపిణీ చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తహశీల్దార్ అజురఫీజాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 పంచాయతీలకు సంబంధించి 15020 కార్డులు వచ్చాయన్నారు. ఈ నెల 25 నుంచి 31 వరకు సచివాలయాల ద్వారా మరల సెప్టెంబర్ 1నుంచి 15 వరకు రేషన్ షాపు డీలర్లు ద్వారా పంపిణీ చేస్తామన్నారు. సెప్టెంబర్ 16 నుంచి 20 వరకు సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ జరుగుతుందన్నారు. మండలంలో ఉన్న ప్రజలందరూ తప్పనిసరిగా కొత్త రేషన్ కార్డులు పొందాలని కోరారు.

తుపాకులు దొరికితే చర్యలు

వేపాడ: లైసెన్సు లేని తుపాకీలు దొరికితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుదర్శనరావు హెచ్చరించారు. కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం చినదుంగాడ, పెదదుంగాడ, కడకొండ, పోతుబంది పాలెం, వెంకటపాలెం గ్రామాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లైసెన్స్ లేకుండా నాటుతుపాకీలు తయారు చేయడం, ఉపయోగించడం, కలిగి ఉండడం చట్టప్రకారం నేరమన్నారు. అలాంటివి ఏమైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని, వారిపైన ఎటువంటి కేసులూ నమోదు చేయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు

గంట్యాడ: మండల కేంద్రంలోని గంట్యాడ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలోని విద్యార్థులకు ఆదివారం క్విజ్ పోటీలను నిర్వహించారు. వసతి గృహ సంక్షేమ అధికారి గొర్రెల గోవింద సన్యాసిరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులను గ్రూప్‌లుగా ఏర్పాటు చేసి సబ్జెక్టు వారీగా క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులలోని విద్యా ప్రమాణాలు స్థాయిని పెంపొందించేందుకు ప్రతినెలా క్విజ్ పోటీలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

'వైసిపిది విష ప్రచారం'

బొండపల్లి: వికలాంగుల పింఛనలను పునఃపరిశీలన విషయంలో వైసిపి నాయకులు విష ప్రచారాన్ని టిడిపి శ్రేణులు తిప్పికొట్టాలని గజపతినగరం ఎఎంసి చైర్మెన్ పివివి గోపాలరాజు, గంట్యాడ మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని గొట్లాం గ్రామంలో గొట్లాం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంనకు నూతన చైర్మెన్‌గా సిడగం శ్రీనివాసరావు, ఇతర సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వికలాంగుల పింఛన్ల విషయంలో ధర్మబద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. వాస్తవానికి పింఛన్లను తొలగించలేదని, కేవలం పునఃపరిశీలన చేస్తుందని వైసిపి నాయకులు గ్రామాలలో పింఛన్లు తొలగిస్తున్నారని విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మెన్ కోరాడ కృష్ణ, మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, మాజీ వైస్ ఎంపిపి బొద్దురాము, మండల పార్టీ అధ్యక్షులు రాపాక అచ్చం నాయుడు, మాజీ సర్పంచ్ తాళ్ళపూడి రమణ, క్లస్టర్ ఇంచార్జీలు నంబూరి రాజేష్, డోకుల శ్రీను, పిఎసిఎస్‌సిఇఒ అచ్చెం నాయుడు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ హామీలు ఏమయ్యాయి?

చీపురుపల్లి : చీపురుపల్లి ఆర్ఇసిఎస్‌ను పునరుద్ధరిస్తామంటూ కూటమి పాలకులు ఎన్నికల ముందు చేసిన హామీలు ఏమయ్యాయని సామాజిక న్యాయ ఉద్యమ వేదిక జిల్లా కన్వీనర్ గంటాన అప్పారావు ప్రశ్నించారు. ఆదివారం చీపురుపల్లిలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆర్ఇసిఎస్‌ను తొక్కిపెట్టి ఎపిఇపిడిసిఎల్‌ను కొనసాగించడానికి కుట్ర జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గత పాలకులు ఆర్ఇసిఎస్‌లో అంతులేని అవినీతికి పాల్పడ్డారని దొంగ సర్టిఫికెట్‌తో ఉద్యోగాలను పొందారని వీటిపైన విజిలెన్స్ అధికారులు కూడా చర్యలు తీసుకోకుండా మేనమేషాలు లెక్కపెడుతున్నారని ఆయన ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల విద్యుత్ కష్టాలను కనీస సంబంధిత అధికారులు గాని, పాలకులు గానీ పట్టించుకోవడంలేదని అన్నారు. రైతుల వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ అందచేయకపోవడం వల్ల రైతులు ఎన్నో విధాలుగా నష్టపోతున్నారని పాలకులు అధికారులు రైతుల కష్టాల పైన దృష్టి సారించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

నీట్ ర్యాంకర్ హర్షవర్ధన్‌కు సన్మానం

బొబ్బిలి: నీట్ పరీక్షలలో స్టేట్ మొదటి ర్యాంక్ సాధించిన ఆకుల హర్షవర్ధన్‌ను ఎమ్మెల్యే బేబినాయన సన్మానించారు. రామభద్రపురం మండలం మామిడివలసకు చెందిన ఆకుల చిన్నంనాయుడు, రమణమ్మ దంపతులు కుమారుడు హర్షవర్ధన్ నీట్ పరీక్షలలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్, జాతీయ స్థాయిలో 369వ ర్యాంక్ సాధించాడు. దీంతో కోటలో ఆదివారం హర్షవర్ధన్‌ను సన్మానించి అభినందించారు. కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని బేబినాయన అన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదవాలని కోరారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నైట్‌హాల్ట్ బస్సు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - వేపాడ

విశాఖపట్నం నుంచి గోపాలపట్నం, పెందుర్తి, కొత్తవలస, సోంపురం, సింగరాయి జంక్షన్ మీదుగా వేపాడకు నైట్ హాల్ట్ బస్సు ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు, విజ్జపు సంపత్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం వారు ఉత్తరాంధ్ర రీజనల్ ఆర్‌టిసి చైర్మన్ దొన్నదొర నివాసానికి వెళ్లి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎస్.కోట డిపో నుంచి ఎమ్ అలమండ, చోడవరం వెళ్లే బస్సుని మరలా పునరుద్ధించాలని ఈ రెండు బస్సులు ప్రయాణికులతో పాటు ఉద్యోగస్తులకు, విద్యార్థులకు అత్యవసర వైద్య సేవలకు, ఫ్యాక్టరీలలో డైలీ వేజ్ కూలీలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం ఆయన దరఖాస్తు అందించారు. స్పందించిన ఆయన తప్పనిసరిగా బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు అప్పారావు తెలిపారు.

అప్పుల బాధతో ఉద్యోగి ఆత్మహత్య

రామభద్రపురం: మండల పరిధిలోని దుప్పలపూడి గ్రామానికి చెందిన ఉద్యోగి పురుగు మందు తాగి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శీర రాఘవ (29) అనే యువకుడు మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం చిన గొడభ గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. విలాస వంతమైన జీవితానికి అలవాటు పడి అధిక ఖర్చులు చేస్తుండడంతో అప్పులు పాలయ్యాడు. స్వగ్రామానికి వచ్చి జీవితంపై విరక్తి కలిగి శనివారం పాత ఇంట్లో పురుగులు మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆరికతోట పిహెచ్‌సికి తీసుకు రాగా ఇక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి బాడంగి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవల కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. తండ్రి ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

ఏడుగురు అరెస్టు

తెర్లాం: ఎస్ఐ సాగర్ బాబు ఆధ్వర్యంలో పెరుమాలిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి దగ్గర నుండి రూ.30100 సీజ్ చేసి, వారిని కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కంటోన్మెంట్: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్స్ క్వార్టర్స్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని వన్ టౌన్ సిఐ అర్‌వి అర్ కే చౌదరి తెలిపారు. మతి చెందిన వ్యక్తి వయసు సుమారుగా 40 - 50 సంవత్సరాల మధ్య ఉండవచ్చుని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిసిస్తే, మృతదేహాన్ని గుర్తిస్తే 9121109419 నెంబరుకు సమాచారం అందించాలని సిఐ కోరారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోండి : సిఐటియు

ప్రజాశక్తి - తెర్లాం



నిరసన ర్యాలీ చేస్తున్న ఆటో డ్రైవర్లు, నాయకులు

ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడి కార్యాలయం వద్ద ఆదివారం ఆటో డ్రైవర్లతో కలిసి ఆయన నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఫ్రీ బస్సు సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్లు కిరాయిలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దీనికి ముందు కూనాయివలస, ఆమిటి, పనుకువలస, నెమలాం, ఆటో స్టాండ్లలో కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వల్ల ఆర్థికంగా దెబ్బతిని దినదిన గండంగా జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు ఫ్రీ బస్సు పథకం మరింత నష్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.25వేలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆటోడ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని వారి కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా వెల్ఫేర్ బోర్డుని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 21 రద్దు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని విమర్శించారు. బ్రిటీష్ చట్టాల కంటే కఠినంగా తయారు చేసిన బిఎన్ఎస్ 106 (1)(2) చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. రవాణా రంగం ద్వారా ప్రభుత్వానికి కోట్లది రూపాయల పన్నుల రూపంలో ఆదాయం సమకూరుస్తుందని అయినప్పటికీ రవాణా రంగా కార్మికులకు ఆటో డ్రైవర్లకు ఒక్క సంక్షేమ చట్టాన్ని అమలు చేయకపోవడం ప్రభుత్వాల అసమర్ధతను తెలియజేస్తుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు చలో విజయవాడ సమ్మెతో పాటు అనేక ఆందోళన కార్యక్రమాలు చేపడతారని తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు తెర్లాం మండలం నాయకులు సింగిరెడ్డి గోపాలు, ఆటో యూనియన్ నాయకులు చింత మహేష్, పిల్ల తిరుపతి, అప్పలనాయుడు, గోంగాడ లక్ష్మి నాయుడ తదితరులు పాల్గొన్నారు.

30న సేనతో సేనాని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఈనెల 30న అంటే శనివారం విశాఖ వేదికగా జనసేన పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నారని, "సేనతో సేనాని " పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన నాయకుడు, రాష్ట్ర పారా వాలీబాల్ అసోసియేషన్ సభ్యుడు సురేంద్ర దేవా విజ్ఞప్తి చేశారు. శాసనసభ ఎన్నికల్లో నూటికి నూరు శాతం విజయం సాధించిన అనంతరం విశాఖలో పార్టీ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం ఇదే తొలిసారని,. ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే ఈ సభకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు

80 శాతం వరినాట్లు పూర్తి

ప్రజాశక్తి-విజయనగరంకోట


వరినాట్లు వేస్తున్న కూలీలు

ఇటీవల కురిసిన వర్షాలతో విజయనగరం మండలంలో 80శాతం వరినాట్లు పూర్తయ్యాయి. మండలంలో 3875 ఎకరాల వరి సాగుకు గాను 3200 ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. గత నాలుగు రోజుల క్రితం వరకు కురిసిన వర్షాలకు మరింత ఊపందుకున్నాయి. ఇప్పటివకే వరినాట్లు వేసిన రైతులు ఎరువుల కోసం ఆర్‌బికెలు, పిఎసిఎస్‌లకు తిరుగుతున్నారు. అయితే విశాఖ పోర్టు నుంచి కంటైనర్ ద్వారా డిఎపి 440 మెట్రిక్ టన్నులు రానున్నదని అధికారులు చెబుతున్నారు. వీటిలో ఎక్కువ మొత్తం మార్క్‌ఫెడ్ ద్వారా 22 రైతు సేవా కేంద్రాలకు అందించనున్నారు. విజయనగరం మండల పరిధిలో 6 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో చూసుకుంటే ద్వారపూడి , గుంకలాంలో 12 మెట్రిక్ టన్నుల యూరియా, 12 మెట్రిక్ టన్నుల డిఎపి అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. రాకోడు, పినవేమలి ఆర్‌బికెల్లో 24మెట్రిక్ టన్నుల యూరియా, 12 మెట్రిక్ టన్నుల డిఎపి, జొన్నవలస రైతు భరోసా కేంద్రంలో 24 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఎక్కడా ఎరువుల కొరత లేదని అన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి- గంట్యాడ

వ్యవసాయానికి సంబంధించిన ఎరువులను పురుగుల మందులను అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తప్పవని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి ప్రసాద్‌రావు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఎరువులు దుకాణాలను ఆయన పరిశీలించారు. స్థానిక వ్యవసాయ శాఖ రెవెన్యూ పౌర సరఫరాల శాఖ పోలీస్ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి మండలంలోని అన్ని ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించిన అధిక ధరలకు విక్రయించినా లింకు ప్రోడక్ట్‌లను బలవంతంగా రైతులకు అనుసంధానం చేసిన సంబంధిత డీలర్ల పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డిఎపి, యూరియాల నిల్వలను తనిఖీ చేశారు. కొట్టారుబిల్లి జనక్షన్‌లోని శ్రీ వెంకటరమణ జనరల్ స్టోర్స్, శ్రీ బాలాజీ స్టోర్స్, మన గ్రోమోర్ సెంటర్లలో రికార్డులను ఫిజికల్ స్టాక్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ మూర్తి, వ్యవసాయాధికారి బి.శ్యామ్ కుమార్, గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని డెంకాడ గ్రామంలో గల సాయికృష్ణ రైతు మిత్ర గ్రూప్ ఎరువులు పురుగు మందులు, విత్తనాల షాపును ఆదివారం శ్రీకాకుళం విజిలెన్స్ సారధ్యంలో జిల్లా వ్యవసాయ అధికారులతో కలిపి విజిలెన్స్ హెచ్‌సి కామేశ్వరరావు, పూసపాటిరేగ వ్యవసాయ అధికారి, డెంకాడ వ్యవసాయ అధికారి సంగీత తనిఖీలు నిర్వహించారు. షాపులో గల ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌లను, డిబిటి పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రసాయనిక నిల్వలను, గడువు ముగిసిన డేట్‌లను పరిశీలించి వాటి వివరాలను పొందుపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మకాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడిన, ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినా, ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పి కంటే అధికంగా అమ్మిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కల్లేపల్లికి శ్మశానవాటికేది?

ప్రజాశక్తి- లక్కవరపకోట


పొలం గట్లపై నుంచి శవాన్ని తీసుకెళ్తున్న దళితులు


మండలంలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన దళితులకు శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన దళిత మహిళ గాడి లక్ష్మి (53) అనారోగ్యంతో మృతి చెందగా దహన సంస్కారాలు చేసేందుకు శ్మశానం లేక చెరువులో దహన సంస్కారాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 79 ఏళ్లు కావస్తున్నా దళితులకు శాశ్వత శ్మశానాలు లేక చెరువుల్లో దహన సంస్కారాలు చేస్తున్నారన్నారు. దహన సంస్కారాలు చేసేందుకు శవాన్ని తీసుకెళ్లేందుకు కూడా దళితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్మశానానికి వెళ్లేందుకు పంట పొలాల్లో అష్టకష్టాలు మీద వెళ్లాల్సి వస్తుందన్నారు. శ్మశాన వాటిక కోసం పలు దఫాలు గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేశామని కలెక్టరేట్ వద్ద ధర్నాలు కూడా చేశామని గుర్తు చేశారు. కనీసం దళితులు చనిపోయినప్పుడు పూడ్చిపెట్టడానికి కూడా స్థలం ఇవ్వరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి దళితులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లేపల్లి గ్రామానికి చెందిన దళితులు గాడి శ్రీను, గాడి వెంకటరావు, బొమ్మ సన్నీ బాబు, గాడి ఈశ్వరరావు, గొల్ల నారాయణ, గాడి చిన్నప్పరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాల్లో దందా

చీపురుపల్లి: మద్యం అమ్మకాల్లో వైన్ షాపుల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి దందా చేస్తున్నారని నియోజకవర్గం జనసేన నాయకులు శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ మేరకు స్థానిక ఎక్సైజ్ సిఐకి ఆయన ఆదివారం ఫిర్యాదు చేశారు. ప్రత్యేక ముద్రతో పల్లెల్లో బెల్ట్ షాపుల నిర్వహణ చేస్తున్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని శ్రీనివాసరావు ఆరోపించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల మద్యం షాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనలకి విరుద్ధంగా సిండికేట్‌గా ఏర్పడి రోజువారీ దోపిడీకి సిద్ధమయ్యారన్నారు. భవన నిర్మాణ కార్మికులు, రైతు కూలీలు సేవించే చీప్ లిక్కర్‌పై ప్రత్యేక ముద్రతో అదనంగా ఒక్కొక్క సీసాపై పది రూపాయలు పెంచి పేదవాడి కష్టాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. పల్లె పల్లెకు బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయించి అక్రమ దందాకు తెరలేపారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా మద్యం రేటు పెంచి అమ్ముతున్న షాపులపై విచారణ జరిపించి లైసెన్సులు రద్దుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట చీపురుపల్లి టిడిపి నాయకులు రౌతు షణ్ముఖరావుతో పాటు కూటమి నాయకులు ఉన్నారు.

ప్రతిభకు అరుదైన గుర్తింపు

ప్రజాశక్తి - పూసపాటిరేగ


శ్రీను మహంతి

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఫైర్ అండ్ సేఫ్టీ ఇంజినీరింగ్ (ఐఐఎఫ్ఎస్ఇ) ప్రతిష్టాత్మకమైన (డబ్ల్యూఎస్ఒ) ఇండియా (రాష్ట్రస్థాయి) (ఒహెచ్ఎస్ఇ) అవార్డు - 2025ని గెలుచుకుందని ఐఐఎఫ్ఎస్ఇ సంస్థ డైరెక్టర్ శ్రీను మహంతి తెలిపారు. ప్రజలు, ఆస్తి, వనరులతో పాటు పర్యావరణ పరిరక్షణలో ఈ సంస్థ చూపుతున్న అంచెల కృషికి ఇది నిదర్శనం అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 20 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వరల్డ్ సేఫ్టీ ఆర్గనైజేషన్‌లో భాగంగా ఉన్న (ఐఐఎఫ్ఎస్ఇ), వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రత పర్యావరణ ప్రమాణాల పెంపుదలలో తన అంకితభావాన్ని మరొకసారి రుజువు చేసిందన్నారు. ఈ అవార్డు, ఐఐఎఫ్ఎస్ఇలోని బృందం అవిశ్రాంత శ్రమకు, శ్రేష్ఠత సాధించాలన్న సంకల్పానికి ప్రతిబింబమని సంస్థ చెప్పారు. ఈ విజయానికి సహకరించిన సిబ్బంది, విద్యార్థులు, సహచరు లందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఈ అవార్డు ప్రదానోత్సవం అక్టోబర్‌లో ముంబైలో జరగనుందన్నారు. పారిశ్రామిక అగ్నిమాపక, భద్రతా ఇంజనీరింగ్ రంగంలో చేసిన కృషికి ఈ గుర్తింపు దక్కడం విశిష్ట మైలురాయిగా నిలిచిందని అన్నారు.

ఎస్ఎ బయాలజీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు

ప్రజాశక్తి - వేపాడ



మండలంలోని సింగరాయి గ్రామానికి చెందిన బోకం అనిత ఎపి డిఎస్‌సి ఫలితాల్లో స్కూలు అసిస్టెంట్ బయాలజీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. అనిత 89.7 శాతం మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ఫస్ట్ ర్యాంకును సొంతం చేసుకుంది. దీంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆమెకు అభినందనలు తెలిపారు.

లోకేశ్వరికి మూడు పోస్టులు



బొండపల్లి: మండలంలోని బొండపల్లి గ్రామానికి చెందిన బెళగాం లోకేశ్వరి డిఎస్‌సి ఫలితాల్లో మూడు విభాగాలకు ఎంపికై ఔరా అనిపించారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ విభాగంలో 13వ ర్యాంకుతో పాటు మహిళల విభాగంలో రెండో ర్యాంకు, పిజిటిలో 9వ ర్యాంకు, టిజిటిలో 22వ ర్యాంకు సాధించారు. కాగా లోకేశ్వరి భర్త గెద్ద గురునాయుడు బొండపల్లి హై స్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఒకేసారి మూడు ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన లోకేశ్వరికి పలువురు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సామాజిక చైతన్యమే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సామాజిక చైతన్యం కలిగించడమే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మిర్యాల కృష్ణారావు అన్నారు. జెవివి జిల్లా కమిటీ సమావేశం గురజాడ పాఠశాలలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ జెవివి ప్రతినిధులు ప్రజల్ని చైతన్య పరుస్తూ, వారిలో కూడా సామాజిక స్పృహను కలిగించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెవివి జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, రాష్ట్ర నాయకులు గండ్రేటి లక్ష్మణరావు, గండ్రేటి అప్పలనాయుడు, జెవివి జిల్లా కోశాధికారి షిణగం శివాజీ, జెవిని ప్రతినిధులు పి. షణ్ముఖరావు,మురపాక పైడినాయుడు,సుంకర సూర్యనారాయణ, శీరాపు శ్రీనివాస్, పంపాన రామారావు, పోలినాయుడు, టివి దుర్గారావు పాల్గొన్నారు.

మెట్ల పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం సిఅర్ కాలనీలో మెట్ల పై నుంచి జారీ పడి దేవు అప్పల చారి (59) మృతి చెందాడని విజయనగరం రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం ఇంట్లో అప్పల చారి ప్రమాదవ శాత్తు మెట్ల పై నుంచి జారీ పడడంతో తలకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆయన తెలిపారు. మృతుడు కుమారుడు గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆత్మహత్య కేసులో నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని పిడిశీల గ్రామానికి చెందిన కె.సాయిసుధా (29) అనే మహిళ ఈ నెల 19వ తేదీన ఉరి వేసుకుని ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన యుడ్ల ఈశ్వరరావు అనే వ్యక్తి ఆమెను సుమారు 11 సంవత్సరాల క్రితం పరిచయం చేసుకొని ఆమెను మానసికంగా, శారీరకంగా హింసించి, వేధించి మనశ్శాంతి లేకుండా చేసినందున ఆత్మహత్య చేసుకొని చనిపోయినట్లు నిర్ధారించారు. ఈ మేరకు ఆదివారం ఈశ్వరరావును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

పొట్టేలు పందేలపై దాడి

బొబ్బిలి: మండలంలోని పాత పెంట గ్రామ శివారులలో కొంతమంది వ్యక్తులు పొట్టేలు పందేలు ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంపై సిఐ కె.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది దాడులు నిర్వహించారు. పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు గొర్రి పోతులను, రూ.2116 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు

ఆనందో బ్రహ్మ అకాడమీ టీమ్ ప్రతిభ

బొబ్బిలి: విశాఖ ఉడా చిల్డ్రన్స్ క్లబ్‌లో విశాఖపట్నం రైటర్స్ అకాడమీ నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి కామెడీ స్కిట్స్ పోటీల్లో బొబ్బిలి ఆనందో బ్రహ్మ అకాడమీ టీమ్ సభ్యులు ప్రతిభ కనబరిచారు. కామెడీ స్కిట్ పోటీలలో ఆనందోబ్రహ్మ టీమ్ సభ్యులు ప్రదర్శించిన స్కిట్ నాల్గవ స్థానం కైవసం చేసుకుంది. టీమ్ సభ్యులు విజయమోహన్, వెంకటరమణ, ఇతర సభ్యులను ఎమ్మెల్యే బేబినాయన, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ రౌతు రామమూర్తి, పట్టణ ప్రముఖులు అభినందించారు.

'శ్రీకృష్ణ రూపంలో ఎన్‌టిఆర్ విగ్రహాలు పెడితే ఊరుకోం'

కంటోన్మెంట్: గుంటూరు జిల్లా తక్కెళ్ల పాడు గ్రామంలో శ్రీకృష్ణుడు రూపంలో ఎన్‌టి ఆర్ విగ్రహాన్ని పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యాదవ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గదుల సత్యలతయాదవ్ తెలిపారు. ఆదివారం దాసన్న పేటలో ఆ సంఘం భవనంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. అందరి రూపాల్లో ఉన్న శ్రీకృష్ణుడిని ఎన్‌టిఆర్ రూపంలో ఏర్పాటు చేయడం తగదన్నారు. సమావేశంలో జిల్లా యాదవ సంఘం ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు గువ్వల తిరుపతి రావు , నాయకులు బొద్దాన అప్పారావు, జానా గౌరీ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

విజయనగరం టౌన్: అయ్యన్నపేట జంక్షన్ లో ఉన్న మదర్ తెరిసా సేవా సంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్, మదర్ తెరిసా కిడ్స్ స్కూల్ సంయుక్తంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టివినాయక విగ్రహాలను ఆదివారం పంపిణీ చేశారు. త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం, సభ్యులు సంధ్యారాణి, శ్రావణి, కీర్తన, కొల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల ప్రయోజనాలను కాపాడాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వం ఇస్తున్న అడ్మిషన్లను గౌరవించి చట్టం అమలులో భాగమవుతున్నా, ప్రైవేట్ విద్యా సంస్థల ప్రయోజనాల్ని అమలుచేయడం లేదని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అప్పుస్మా) లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ అభిప్రాయపడ్డారు. స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం జరిగిన జిల్లా జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి స్కూల్ కరెస్పాండంట్స్‌ను ఉద్దేశించి ప్రసంగించారు.విద్యా హక్కు చట్టంలో, సెక్షన్ 12(1)(ఏ), 12(1)(బి) ప్రకారం ప్రభుత్వ స్కూల్స్, అన్ ఎయిడెడ్ స్కూల్స్‌లో సీట్లు నింపాక కూడా డిమాండ్ ఉంటే ప్రైవేట్ స్కూల్స్‌కు అడ్మిషన్లు ఇవ్వాలని ఆయన అన్నారు. అంతే కాకుండా చట్టం నిర్దేశించిన సెక్షన్ 12(2) ప్రకారం ఫీజు నిర్ణయించాలని, అందుకు ప్రతిగా విద్యా శాఖా అధికారులు ఏ రాష్ట్రంలోనూ అమలులో లేని, ఏ విధమైన నిబంధనలు లేకుండా ప్రైవేట్ స్కూల్స్‌కు స్టార్ రేటింగ్స్ నిర్ణయించడం, చట్టాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. 3సంవత్సరాలు గా అడ్మిషన్లను ఇచ్చి విద్యనందించిన ప్రైవేట్ పాఠశాలలకు ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎసిక్స్ కార్పొరేషన్ నుండి ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలకు, ఆ స్కూల్స్ లో పనిచేస్తున్న సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం నుండి ఇటీవల కాలంలో వచ్చిన రాయితీల గురించి ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ శ్యాంప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో అప్పుస్మా జోనల్ ప్రెసిడెంట్ ఎంవి రావు, జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు, గౌరవాధ్యక్షులు ఎంవిఆర్ కృష్ణాజీ, కార్యదర్శి సిహెచ్ రమేష్, ట్రెజరర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

40 కుటుంబాలు జనసేనలో చేరిక

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

నగరంలోని 11వ డివిజన్ కాటవీధి కి చెందిన 40 కుటుంబాలు ఆదివారం జనసేన పార్టీలో చేరాయి. స్థానిక నాయకులు లోపింటి వెంకట ప్రసాద్ ఆధ్వర్యాన వీరంతా జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జనసేన పార్టీలో చేరిన వీరికి ఆ పార్టీ నాయకులు అవనాపు విక్రమ్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై తటస్థులు సైతం జనసేన పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సాలూరు జనసేన నాయకులు జరజాపు సూరిబాబు, విజయనగరం నియోజకవర్గం నాయకులు పత్తి గిల్లి వెంకటరావు, ఎర్నాగుల చక్రవర్తి, మండల లోకేష్, విజయ్ కుమార్, ఉమామహేశ్వరరావు, లోకనాథ్, హరి, షేక్ మారేష్, ఇజ్జడ సాయి, నరసింగరావు, నారాయణరావు, పోతన్న, ముని లక్ష్మణారావు తదితరులు పాల్గొన్నారు.